# ఎడ

సమయం ఎంతయి ఉంటుందో తెలియదుకాని చీకటి పడడం మొదలు కాలేదు. వెలుగు తగ్గుతోంది. షాపులో కూర్చుని స్టౌ బాగు చేస్తున్నాను. నా షాపు వీధి చివరన ఉండటాన పడమటి నీడ త్వరగా పడిపోతుంటుంది. చాలాసార్లు గదిలో నీడ పడకముందే దీపాలు వెలిగించాలసి వస్తుంటుంది. దీపం వెలిగించడానికి లేద్దామనుకునేంతలో షాపు ముందు ఖరీదయిన నీలం రంగు కారు ఆగింది. చుట్టుపక్కల మరికొన్ని షాపులున్నాయి. దేనికోసమో వచ్చి ఉండాలి. నా కోసం కార్లు రావు. దీపాలు వెలిగించి స్టౌ మరామత్తు చేయడంలో మునిగిపోయాను. స్టౌ బాగు చేయడానికి ఇచ్చిన వ్యక్తి మరో ఇరవయి నిమిషాల్లో వస్తాడు.

నీలం రంగు హారన్ మోగింది. తలెత్తి కారు వంక చూశాను. ముందు తలుపు కిటికీ మీంచి గంగాధరం తల బయట పెట్టి నన్ను తన దగ్గరకు రమ్మని చేయి ఊపుతున్నాడు. అతను కాక మరొకరెవరయినా అయి ఉంటే లేచి వెళ్ళి ఉండే వాడిని. అతని కోసం చేస్తున్న పని ఆపి లేవబుద్ధి కాలేదు.

"పనిలో ఉన్నాను. నువ్వే రారా" అన్నాను.

నేను తన దగ్గరకు అగ్గగ్గలాడుతూ వెళ్ళడానికి ఇష్టపడడం లేదని అర్థమయి ఉండాలి. నేనూ వాడు మాట్లాడుకోవలసినవేమీ లేవు. వాడు కారు స్టార్టు చేసి ముందుకు తీసుకువెళ్తోంటే వెళ్ళిపోతున్నాడని అనుకున్నాను. వాడితో మాట్లాడడం నాకు ఇష్టం లేదు. వాడు వెళ్ళలేదు. వీధి చివరి వరకు కారు తీసుకెళ్ళి ఆపి, దిగి నేను కూర్చున్న చోటకు వచ్చాడు. తనను నా దగ్గరకు రప్పించుకున్నందుకేమో ముఖం కోపంగా పెట్టుకున్నాడు.

మాలో బాగా చదువుకుంది వాడే. స్నేహితుల మందరం వాడికి చాలా గౌరవం ఇచ్చేవాళ్ళం. ఆస్ట్రేలియా వెళ్ళడానికి వాడికి డబ్బు తక్కువయితే ఏవేవో తంటాలు పడి సర్దాం. వాడి తల్లి అయితే మిగిలిన ఒక్క ఇంటిని తాకట్టు పెట్టి డబ్బు తెచ్చిచ్చింది.

నాది చిన్న షాపు. వచ్చినవాళ్ళను కూర్చోమనడానికి ఒక్క కుర్చీ కూడా లేదు. చిన్న ఇనపస్టూళ్ళు రెండున్నాయి. మట్టిపట్టి మురికిగా ఉన్నాయి. వాటిమీద

బి.పి.కరుణాకర్

కూర్చోమంటే కూర్చోకపోవచ్చు. అసలు వాడిని కూర్చోమనడం నాకు ఇష్టం లేదు.

వాడి ముఖంలోకి చూసి, "ఏమిటిలా వచ్చావు?" అడిగాను. ఎందుకు వచ్చి ఉంటాడో నా ఊహకు తడుతోంది.

వాడేదో చెప్పబోయేంతలో స్టౌ తీసుకుని మరొకామె వచ్చింది. పక్కకు తొలిగి తలుపు వారగా నుంచున్నాడు. ఉదయం పదింటి నుండి రాత్రి తొమ్మిదీ తొమ్మిదిన్నర వరకు ఎవరో ఒకరు మరామత్తుల కోసం వస్తూనే ఉంటారు. ఇంటికి చేరుకునేసరికి పది దాటుతుంది. కావాలనే ఆమెతో ఎక్కువసేపు మాట్లాడుతూ ఉండిపోయాను. వెళ్ళలేదు. వాడి అవసరమయితే ఎదుటివాడి కాళ్ళమీద పడయినా తన పనులు చేయించుకోవడానికి సిగ్గెం పడడు.

సరిగ్గా నెలా పదిరోజుల కిందట దాదాపు ఇదే సమయంలో రామకృష్ణాపురంలోని వాడింటికి వెళ్ళినప్పుడు వాచ్‌మేన్ నన్ను లోపలికి వెళ్ళనీయలేదు. బయటే నిలబెట్టాడు. చిన్న కాయితం మీద నాపేరు రాశాను. వచ్చిన పని కూడా రాద్దామనిపించింది కాని రాయలేకపోయాను. ఆ కాయితం తీసుకుని వాచ్‌మేన్ లోపలికి వెళ్ళి వెంటనే తిరిగి వచ్చి, "సార్ కిచ్చాను. కొద్దిసేపు ఆగమన్నారు. ఆగు... కొద్దిగా పక్కగా నిలబడు. గేటు ముందు నుంచోకు...కార్లు వస్తుంటాయి." అన్నాడు.

అసలక్కడకు ఎందుకు వచ్చానా అనిపించింది. వాడి ఫోను నెంబరు కాని సెల్ నెంబరు కాని మా వాళ్ళకెవరికీ తెలియదు. తెలిసుంటే రాకపోదును. అరగంట దాటింది. గంట తర్వాత అక్కడ ఉండడం అనవసరమనిపించింది. వాడు ఆస్ట్రేలియా నుండి తిరిగి వచ్చాడని, మళ్ళీ వెళ్ళబోవడం లేదని విన్నాను కాని ఇంతలా ఎదిగి ఉంటాడని ఊహించలేదు. వాడి భార్య ఇ.సి.ఐ.ఎల్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు కంపెనీవాళ్ళు ఆమెను ఒక ప్రాజెక్టు పనిమీద ఆస్ట్రేలియా పంపించారు. ప్రాజెక్టు పని పూర్తి చేశాక ఆమె అక్కడే వేరే ఉద్యోగంలో చేరి పంపించిన కంపెనీకి రాజీనామా చేసింది. వీడు బి.హెచ్.ఇ.ఎల్.లో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి ఇద్దరు పిల్లల్ని తీసుకుని ఆస్ట్రేలియా వెళ్ళాడు. మూడు నాలుగు సంవత్సరాల వరకు వాడికక్కడ ఏ ఉద్యోగం దొరకలేదు. పిల్లల్ని స్కూలుకు తీసుకెళ్ళడం, తీసుకురావడం, ఇంట్లో వంట చేయడం, లాండ్రీ, డిష్ వాషింగ్ పనుల్లో పడిపోయాడు. ఆ తర్వాత ఏదో పని దొరికినట్టుంది.

మొదటిసారి అక్కడి నుండి తిరిగివచ్చినప్పుడు, 'మనతో వాళ్లు కలవరు. దూరంగా ఉంచుతారు. మనతో మాట్లాడ్డానికి కూడా ఇష్టం చూపించరు' అన్నాడు. ఈ విషయంలో మనమూ తక్కువేం తిన్నాం? వాళ్ళ సంగతి అటుంచు. మనవాళ్లను మనమే దూరంగా ఉంచుతుంటాం కదా? ఏ దేశమేగినా ఎందు కాలిడినా మన కులాలు, బుద్ధులు మనతో భద్రంగా తీసుకెళ్ళి అంటరానితనాన్ని అక్షరాలా పాటించడం లేదూ? అన్నాను. ఏం మాట్లాడలేదు. వాడు ఇక్కడున్నప్పుడు మాతో ఎంతో స్నేహంగా మెలిగినా మా ఇంట్లో ఎప్పుడూ భోజనం చేయలేదు. మంచినీళ్ళు తాగిన గుర్తు లేదు.

గంటంబావుకు గంగాధర్ వీధి గుమ్మం వరకు వచ్చి నా వంక చూసి చేయి ఊపాడు. నేనూ ఊపాను. నన్ను తన ఇంట్లోకి రమ్మంటాడని అనుకున్నాను. రమ్మనలేదు. వాడయినా బయటకు వస్తాడేమో అనిపించింది. రాలేదు. వాడి ఇంట్లో బయటివాళ్ళు ఎవరూ ఉన్నట్టు అనిపించలేదు. వాచ్‌మేన్ చెప్పినట్టు ఏ కారూ రాలేదు. పోర్టికోలో రెండు కొత్త కార్లున్నాయి. ఆ రెండూ వాడివే అయి ఉంటాయి. ఇహ నాకు అక్కడ ఉండ బుద్ధి కాలేదు. విలువయిన సమయాన్ని వృధా చేసుకున్నట్టు అనిపించింది. వచ్చేశాను.

ఆ తర్వాత వాడిని మళ్ళీ ఇప్పుడే చూడడం. నా పని నింపాదిగా చేసుకున్నాక, "చెప్పు, ఎందుకు వచ్చినట్టో?" అన్నాను.

"ఆ మధ్య మాఇంటికి వచ్చావు. నిన్ను మా ఇంట్లోకి పిలుద్దామనుకునేంతలో వెళ్ళిపోయావు..." అన్నాడు.

అబద్ధాలు చెప్పడం వాడికి అతి తేలికయిన విద్య. ఎక్కడ పడి ఊడగొట్టుకున్నాడో ముందరి రెండు పళ్ళు లేవు.

"రావలసివచ్చిందిరా" అన్నాను. వాడిని నేను 'రా' అనడం ఇష్టం ఉన్నట్టు అనిపించలేదనుకుంటాను. ముఖం అదోలా పెట్టాడు. "డబ్బుల కోసమేమీ రాలేదురా. అత్యవసర పనిమీదే వచ్చాను. అది అయిపోయింది. ఇప్పుడేమీ లేదు" అన్నాను.

"ఏమిటది?"

వీపు గోడకానించి కూర్చున్నాను. చాలాసేపటి నుంచి పని చేస్తూ ఉండడం వలన నడుం నొప్పిగా ఉంది. నా దగ్గర పని చేసే కుర్రాడికి వంట్లో బావుండక రాలేదు. తిమ్మిరెక్కిన కాళ్ళను ముందుకు చాపాను. మునుపటంత ఓపిక ఉండడం లేదు.

"యశోదమ్మ తెలుసుకదా...?" ఆగి వాడి ముఖంలోకి చూశాను.

"మా అమ్మ...."

"కనీసం పేరయినా గుర్తు పెట్టుకున్నావు. నేనూ చిన్నప్పటి నుండి 'అమ్మా' అని పిలుస్తుండేవాడిని. ఆ వేళ నీదగ్గరకు వచ్చిన ముప్పావుగంట ముందు ఇంట్లోనే ఎవరితోనూ మాట్లాడుతూ పడిపోయింది. డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లేసరికి దాటిపోయింది. కేవలం ఆ మాట నీకు చెబుదామని నీ ఇంటికి పరుగెట్టుకుంటూ వచ్చాను.. మరెందుకూ కాదు... ఉన్న ఒక్క కొడుకూ రాకపోయినా అందరం కలిసి అన్నీ బాగానే జరిపించాం..." వాడి ముఖంలోకి సూటిగా చెప్పినా వాడి ముఖంలో ఎటువంటి భావం వ్యక్తం కాలేదు. గచ్చుపూతలా ఉంది.

ఈ విషయం వాడికి తెలియకుండా ఉండే అవకాశం లేదు. మనస్సాక్షి ఉన్నవాడయితే ఆ తర్వాతయినా, కనీసం దినానికయినా వచ్చి ఉండేవాడు. ఎందుకు రాలేదో అడగాలనిపించలేదు. అధవా అడిగినా సరయిన జవాబు వస్తుందని అనుకోను.

కని పెంచింది కాబట్టి వాడి గురించి మాకన్నా ఆమెకు బాగా తెలిసి ఉండాలి. అందుకనేమో వాడి నుండి ఏమీ ఆశించలేదు. కనీసం వాడి ప్రస్తావన ఎప్పుడూ తెచ్చేదికాదు. డబ్బు అవసరమయితే పొరపాటునయినా ఎవరినీ అడిగేది కాదు. వచ్చే పింఛను సరిపోకపోయినా ఏ వస్తువయినా తాకట్టు పెట్టి నెట్టుకుంటూ వెళ్ళింది. వాడు మొదటిసారి ఆస్ట్రేలియా వెళ్తున్నప్పుడు వాడికి డబ్బులు సరిపోతాయో, లేదేమోనని ఉన్న పెంకుటిల్లు తాకట్టు పెట్టి ఆ డబ్బు అంతా వాడి చేతిలో పెట్టింది. ఆ ఇల్లు తాకట్టులోంచి అటే చవకగా వెళ్ళిపోయింది. మా ఇంటికి దగ్గరగా ఉన్న అద్దె ఇంట్లో చివరి వరకు ఉంది.

పంట్లాం జేబుల్లో చేతులు పెట్టుకుని, చిన్నగా దగ్గి, "మా అమ్మకు ఒక బంగారపు గొలుసు, దుద్దులు, రెండు జతల గాజులు, ఒక ఉంగరం ఉండాలి... వాటిగురించి నీకేమయినా తెలుసా?" నెమ్మదిగా అడిగాడు.

గద్ద రెక్కలు టపటప కదిలినట్లు అనిపించాయి. కోపం తన్నుకొస్తోంది. తరతరాలుగా స్త్రీని దోపిడీ చేయడం సొంతవారి నుండే మొదలయి సంస్కృతిగా మారింది. ఎదురుగా ఉన్న స్టౌ ఎత్తి, వాడి ముఖం మీద పడేలా విసిరాను.

* ఆదివారం వార్త, 17 అక్టోబరు 2010